సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం,29 జూలై 2024


# ప్రకృతి సంరక్షణ వ్యక్తిగత బాధ్యత - డాక్టర్ బిఈవిఎల్.నాయుడు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణాదినోత్సవ కార్యక్రమం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్.నాయుడు తెలిపారు.
భవిష్యత్ తరాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని, ఆరోగ్యకరమైన వాతావరణానికి బాటలు వేస్తూ ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే ఉద్దేశ్యంతో ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ప్రకృతిలో అంతరించి పోవడానికి సిద్ధంగా ఉన్న జీవరాశులను, వృక్ష సంపదను కాపాడాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పర్యావరణహిత కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని పరిరక్షించి నప్పుడే మానవ మనుగడ సజావుగా ఉంటుందని తెలిపారు.అనంతరం కళాశాల సమీపంలో మొక్కలు నాటారు. విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇంచార్జ్ మూర్తి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, ఐ గౌరీ ప్రియ మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.



## జవాబుదారీ తనమా

# నీ జాడ ఎక్కడ ?

- ఆశలు చూపి... అమ్మకాలు జరిపేలా... అక్రమాలకు అండ గరికపాటి డెవలపర్స్ యాజమాన్యం అధికారులకు నేడు కూటమి ఎమ్మెల్యే పేరుతో బెదిరింపులట..!
- అక్రమ వెంచర్లకు కారకులు ఎవరు పాలకులా? పాలనాధికారులా?
- వడిశలేరులో గరికపాటి డవలపర్స్ ఫాం ల్యాండ్‌పై రుడా విసి బాలస్వామి కన్నెర్ర
- జీవో నెం.443 ప్రకారం చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శికి ఆదేశాలు
- గ్రీన్ విలేజ్ సర్వే నెంబర్లు 'మాస్టర్ డేటా'లో బ్లాక్
- గ్రీన్ విలేజ్‌లో కరెంట్ సర్వీసులు, స్థలాల రిజిస్ట్రేషన్లు జరపకుండా రుడా విసి బాలస్వామి సంబంధిత శాఖల అధికారులకు సూచనలు

**గత ప్రభుత్వ అనపర్తి ఎమ్మెల్యే అండతోనే అరాచకం**

**అధికారుల ఎదుటే అక్రమ ఫాం ల్యాండ్ వెంచర్**




రంగపేట మండలం వడిశలేరులోని గరికపాటి డవలపర్స్ వారి గ్రీన్ విలేజ్ ఫాం ల్యాండ్ నాన్ లేఅవుట్ వెంచర్‌ని కాపాడుకోవడానికి యాజమాన్యం మరింత అక్రమాలకు పాల్పడుతోంది. ఓ కూటమి ఎమ్మెల్యే పేరు చెప్పి అందరినీ బెదిరించడానికి బరితెగించింది. ఆ ఎమ్మెల్యేతో మాట్లాడేసామని, ఒక్కో యకరానికి రూ. ఐదు లక్షలు ముట్ట చెప్పేసామని ...మమ్మల్ని ఏ అధికారి ఏం పీకుతారో చూస్తామని ఫోన్లు చేసి బెదిరింపులకు దిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉండగా పంచాయతీ కార్యదర్శి గ్రామ విఆర్ఓ ఇతర సిబ్బంది డిపిఓ ఆదేశాల ప్రకారం మూడో నోటీసులు జారీ చేశారు. నోటి సారాంశం ప్రకారం వడిశలేరు గ్రామంలో సర్వే నెం. 365/3, 367, 368, 368/ఎ, 368/బి, 368/సి, 368/డి, 370, 371, 372/2, 373/2, 374/2 లలో గరికపాటి డెవలపర్స్ యాజమాన్యం అక్రమంగా, నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్న గ్రీన్ విలేజ్ ఫాం ల్యాండ్‌లో 30 అడుగుల తారు రోడ్లు, సిమెంట్ డ్రైన్లు, మొత్తం వ్యవసాయ భూమి చుట్టూ నిర్మించిన ప్రహారీ గోడలు తొలగించాలన్నదే ఉంది.. దీంతో పంచాయితీ సిబ్బందిపై గరికపాటి వెంకటేశ్వరరావు రెచ్చిపోయినట్లు మీరు ఎలా ఉద్యోగం చేస్తారో చూస్తామని అన్నట్లు చెబుతున్నారు. ఈ పరిణామంతో అధికారులు బెంబేలెత్తినట్లు సమాచారం.. డబ్బున్న మహారాజుకి అన్ని ప్రభుత్వాల్లోనూ రెడ్ కార్పెట్టే అన్నట్లుగా గ్రీన్ విలేజ్‌లో అక్రమాలపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం..

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

- మిగతా 2 లో..

## అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

- ఐటిడిఏ పీవో కాపూరు చైతన్య



**చింతూరు మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలో వరదలు వలన ఎవరైనా నిత్యవసర సరుకులు అధిక ధరలకు అమ్మిన యెడల అటువంటివారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కావూరి చైతన్య హెచ్చరించారు. ఆదివారం వరదలు వలన చింతూరు, చట్టి మధ్యలో మెయిన్ రోడ్డు పై వరద ప్రవాహాన్ని చింతూరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కావూరు చైతన్య మాట్లాడుతూ చింతూరు చట్టి మధ్యలో మెయిన్ రోడ్డు అదేవిధంగా చింతూరు నిమ్మలగూడెం మెయిన్ మెయిన్ రోడ్లుపై వరద నీరురావటంవలన ప్రజలు నీటిలో అటు ఇటు ప్రయాణించకుండా ఎక్కడికక్కడ రెవెన్యూ సిబ్బందిని, పోలీస్‌శాఖ సిబ్బందిని, గ్రామ సచివాలయాలకు సంబంధించిన సిబ్బందిని ఏర్పాటు చేయడం చేశారు. అదేవిధంగా వరదలు వలన నిత్యవసర సరుకులు మరియు తదితర సామాగ్రి అధిక ధరలకు అమ్మిన వారిపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నజీముల్లా, ఎంపీడీవో రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఎఫ్.ఐ. కాకినాడ రూరల్ మండల నూతన కమిటీ ఎన్నిక



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ.) కాకినాడ రూరల్ మండల కమిటీని నూతనంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా రాజేష్, కమిటీ కార్య దర్శిగా సాహిత్ కమిటీ సభ్యులు ఎన్నుకోవడం జరిగింది. మండలం ఉపధ్యక్షులుగా సాయి నిఖిల్, సత్యసాయి సహాయ కార్యదర్శిలుగా వెంకట మణికంఠ, అమృత కమిటీ సభ్యులుగా శ్రావణి, కవిత, విద్యా, సిద్ధి రామ కైలాష్, గమనివేలు, వాసు, రోహిత్ ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు మరియు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సాహిత్ సంయుక్తంగా మాట్లాడుతూ కాకినాడ రూరల్ మండలంలో విద్యారంగ అభివృద్ధికి మరియు విద్యారంగంలో వచ్చిన సమస్యల పరిష్కారానికై ఈ కమిటీ కృషి చేస్తుంది అని అన్నారు. ఎస్ఎఫ్ఐ అభివృద్ధికి బలోపేతం చేస్తామని అన్నారు. ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధికి ఈ కమిటీ కృషి చేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వాసుదేవ్ మరియు కాకినాడ రూరల్ మండల నూతన కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## శ్రీ సత్యదేవుని సన్నిధిలో ప్రతి ఆదివారం శ్రీ స్వామి, అమ్మవార్ల రథంపై రథ సేవ



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో అత్యంత వైభవంగా ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీ స్వామి, అమ్మవార్ల రథసేవ జరుగుతుంది. ముందుగా ఆలయ అర్చకులు రథమును వివిధ రకముల పుష్పములతో అలంకరించి శ్రీ స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించి గుడి చుట్టూ ప్రదక్షణ గావిస్తారు. ఎవరైనా భక్తులు ఈ రథ సేవలో పాల్గొనాలంటే దంపతులు ఇద్దరు పిల్లల కు రూ.2,500/-లు చెల్లించి రథ సేవలో పాల్గొనవచ్చు. సదరు సేవలు ఆంత్రా లయం శ్రీ స్వామి, అమ్మవారి దర్శనం, స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం దేవస్థానంవారు అందజేస్తారు. ఇన్ఫర్మేషన్ కోసం పిఆర్ఓ ఆఫీస్ కాంటాక్ట్ నెంబర్ 08868238163 పిఆర్ఓ విభాగం వారు సమాచారం తెలుపుతారు.

## గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో 'చదవటం మాకిష్టం'



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ కుళాయి చెరువు పార్కులో గల గాంధీ నగర్ శాఖ గ్రంథాలయంలో ఆదివారం నాడు 'చదవటం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులతోకదలు చదివించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు స్నేహబంధం, పరమానందయ్య శిష్యులు కథలు, చందమామ కథలు తదితర పుస్తకములు చదవడం జరిగింది. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకతను తెలియజేశారు.

## విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గం ఎంపిక



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** విశ్వహిందూ పరిషత్ రంపచోడవరం మండల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. స్థానిక విశ్వహిందు పరిషత్ కార్యాలయంలో వి.హెచ్.పి. జిల్లా ప్రఖండ్ ప్రముఖ్ (ప్రభారి) శ్రీ భావన్నారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. మండల ప్రఖండ ప్రముఖ్ (ప్రభారి) గా నల్లమిల్లి వేంకట రామారెడ్డి, అధ్యక్షులుగా పింజర్ల నాగవీరభద్రరావు, ఉపాధ్యక్షులుగా బెజవాడ వేంకటేశ్వరరావు, కారం వీర సత్యవేణి, కార్యదర్శిగా వెలిశెట్టి వీరభద్రరావు, సహ కార్యదర్శిగా ముక్కా శ్రీనివాసరావు, కోశాధి కారిగా బాలనాగు లీల నాగ వీరభద్రగుప్తా, సభ్యులుగా యెజ్జు సతీష్, జొన్నలగడ్డ బాలయ్య, గంగుల సుబ్బారావు, పి.వెంకటలక్ష్మి ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో విహెచ్‌పి జిల్లా కోశాధికారి నీలబోయిన శ్రీనివాసరావు, జిల్లా సహ కార్యదర్శి అన్నవరెడ్డి కృష్ణ కిషోర్, జివికె అప్పర్ ప్రైమరీ స్కూల్ కమిటి సభ్యులు యర్రా ఆనందరావు, అద్దంకి వేంకటేశ్వరరావు, సమరత సేవా ఫౌండేషన్ జిల్లా సంయోజక్ గుడ్ల అంక శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి జాతర



**కరప, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కూరాడ గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామదేవత అన్నారపు అమ్మవారి ఆషాడమాస ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. అమ్మవారిని గ్రామస్తులందరూ కులమతా లకతీతంగా తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తారు. ఆషాడమాసం నాలుగో ఆదివారంను పురస్కరించుకుని వందల సంఖ్యలో ముత్తైదువులు చీరసారే తీసుకుని అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. తెలంగాణ బోనాల తరహాలో నెత్తిపై బోనాలు, ప్రసాదం, చీర సారె పట్టుకుని ఆలయానికి విచ్చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిపారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగించాలి

- కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింది
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగించాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వి.ఉమామహేశ్వరరావు కోరారు.నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకం, ఆదరాభిమానాలకు తగ్గట్టుగా పరిపాలన ఉండాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వంలా కాకుండా ప్రజాస్వామ్యయుతంగా, ఎటువంటి నిర్బంధాలు, అక్రమ అరెస్టులు, దాడులు, దౌర్జన్యాలు లేకుండా ప్రజలు, ప్రజా సంఘాలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు, కోర్కెలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి వీలు కల్పించాలని కోరారు. ప్రజానుకూల విధానాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్లో కార్పొరేట్లకు మేలు చేసే విధంగా సామాన్యులపై భారాలు మోపే విధంగా ఉందన్నారు. కేంద్ర బడ్జెట్లో ఆంధ్రకి అన్యాయం జరిగిందన్నారు. 15 వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తామన్నారు గాని ఏ విధంగా కేటాయిస్తారు అన్న దాంట్లో స్పష్టతలేదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వంకార్మికహక్కులనుకాలరాసిందనిపేర్కొన్నారు.ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికులు ఎన్నో విధాలుగా నష్టపోయారన్నారు. భవన, ఇతర నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు నిధులు దారిమళ్లకుండా వారికే ఖర్చు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో ఉన్న సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు.జిల్లాలో ఏ.పీ. డిడ్కో అపార్ట్మెంట్స్ గతంలో తెలుగుదేశం హయాంలో నిర్మించారనీ, వాటిని లబ్ధిదారులకు అప్పగించడంలో వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణం లబ్ధిదారులకు ప్లాట్లు అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. అకాల వర్షాల కారణంగా నారుమడులు, ఇతర పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలని, విత్తనాలు సబ్సిడీ ధరలకు అందించాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బకాయి విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జి.బేబీ రాణి, కే.ఎస్.శ్రీనివాస్, డి.శేష బాబ్జి, కరణం ప్రసాదరావు, వివిధ మండలాల శాఖ కార్యదర్శులు, జిల్లా ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేద పరిరక్షణే సమాజ శాంతికి మూలం - చింతా శర్మ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** వేదాలను సంరక్షించడం, పరిరక్షించడం ద్వారా సమజ శాంతితో పాటు భావితరాలకు ఆ సంపదను అందించినవారౌతామని ప్రముఖ వేదపండితులు చింతా చలపతి శర్మ అన్నారు. వేదవిజ్ఞాన ప్రతిష్టానమ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామారావుపేటలో ప్రతిష్టాన కార్యాలయ వేదపాఠశాలలో రాష్ట్ర స్థాయి వేద, స్మార్త పరీక్షలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. తొలుత వేదవ్యాస గురువుదేవుల విగ్రహానికి వేదపండితులు పూజలు చేసారు. ఈ పరీక్షలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాల నుండి విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.
పరీక్షలను తిరుపతి వేదిక్ యూనివర్సిటీ వేదపండితులు కోట పంచముఖిశర్మ లాంచనంగా ప్రారంభించారు. అనంతరం పం.చింతాశర్మ మాట్లాడుతూ గత 14 సం లుగా క్రమం తప్పకుండా వేద, స్మార్త పరీక్షలను నిర్వహిస్తూవున్నామని చెప్పారు. రానున్న తరానికి ఈ వేదసంపదను అందిచేందుకు చేస్తున్న ప్రయత్నం యిదన్నారు. శాస్త్రాధ్యయనం చేసిన మహోన్నత వ్యక్తులనుండి ఈ అమూల్యమైన వేదసంపదను పరిరక్షించడంతో పాటు ఆధాత్మిక తత్వాన్ని భోధించమే తమ లక్ష్యమన్నారు. ఈ పరీక్షల న్యాయనిర్ణయాధికారులుగా ప్రముఖ పుణ్యక్షేత్రాలకు చెందిన వేదపండితులు కపిలవాయిరామశాస్రి సోమయాజీ, శ్రీపాద రాజశేఖర శర్మ, మాధవభొట్ల విశ్వనాధశర్మ, దువ్వూరి ఫణియజ్ఞేశ్వర ఘనాపాఠి లు పాల్గొన్నారు. శుక్ల, కృష్ణ యజుర్వేదములు క్రమాంతము, ఋగ్వేదము క్రమాంతము, సామవేదము, అధర్వణ వేదము, కృష్ణ యజుర్వేదము, ఋగ్వేద స్మార్తములలో పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతిష్టానం వేదవిభాగ అధ్యక్షులు పం.రాయప్రోలు ప్రసాదశర్మ మాట్లాడుతూ డా॥చెరుకుపల్లి లక్ష్మినరసింహ శర్మ ఆశయాలకు అనుగుణంగా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహిస్తూ వేద మరియు స్మార్త పండితులను సమాజానికి అందిస్తున్నామని అన్నారు. ప్రతీరోజు వేద మరియు స్మార్త పాఠాలను విద్యార్థులకు ఉచితంగా భోధిస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో మెగంటికామేష్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి ఆదివారం భీమవరంకు చెందిన తటవర్తి వెంకన్న, వెంకట నాగ శాంతిశోభ దంపతులు రూ.60,696 లు; ద్వారపూడికి చెందిన అయినవిల్లి వెంకట సత్యనారాయణ, వీర నాగ మణి దంపతులు రూ.25,200లు; పాలకొల్లుకు చెందిన రేలంగి రాజేంద్ర కుమార్ కుటుంబ సభ్యులు రూ.10 వేలు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సూపర్నెంట్ శ్రీనివాస్, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రుల పర్యటన



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం కే.గంగవరం మండలం కోటిపల్లిలోని వరద ప్రభావిత ప్రాంతాలలో ఆదివారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,పశుసంవర్ధక మత్స్య శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర హెూం వ్యవహారాల శాఖామంత్రి వంగలపూడి అనిత,రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పర్యటించారు. ఈ సందర్భంగా కోటిపల్లి గోదావరి ఉధృతిని, నీట మునిగిన లోతట్టు ప్రాంతాలను మంత్రులు పరిశీలించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని, రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ముంపు ప్రాంతాల్లో సమస్యలపై ప్రజలతో చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డిఓ సుధాసాగర్, ఎంఆర్ఓ రవింద్రనాథ్, విఆర్ ఓ డి. కృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీల సమస్యపై బీజేపీ కీలక సమావేశం

**– రూరల్ గ్రామాలు కాకినాడ కార్పొరేషన్‌లో విలీనంపై బిజెపి చర్చ**

**– ఎమ్మెల్యే పంతం దృష్టికి విలీన గ్రామాల సమస్య**



**కాకినాడరూరల్,మేజర్‌న్యూస్ :** శాసనసభలోని తూరంగి, ఇంద్రపాలెం, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట మరియు చీడిగ గ్రామాలను కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనంపై చర్చించేందుకు భారతీయ జనతా పార్టీ రూరల్ విభాగం ఆదివారం ఉదయం రూరల్ కార్యాలయంలో 11 గంటలకు సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి కాకినాడ రూరల్ విభాగం కన్వీనర్ పితాని లీల అధ్యక్షత వహించగా కాకినాడ జిల్లాఅధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జిరంబాలవెంకటేశ్వరరావులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రూరల్‌లోని గ్రామాలు విలీనంపై శాసనసభ సభ్యుడు పంతం నానాజీని కలిసి చర్చించాలని, కూటమితో కలిపి ఈ గ్రామాల విలీనంపై ఒక నిర్ణయం తీసుకునేలా ప్రయత్నం చేయాలని సమావేశంలో తీర్మానించారు.

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అనేక గ్రామాలు ముఖ్యంగా తూరంగి, ఇంద్రపాలెం, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట, చీడిగ వంటి గ్రామాలుతోపాటు కాకినాడ నగరంలోని 42,48 డివిజన్లకు సుమారు 13 సంవత్సరాలుగా ఎన్నికలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రజా సమస్యలను పరిష్కరించే నాధులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆయా గ్రామాల అభివృద్ధి ఆమడ దూరంలో నిలిచిపోయాయని, త్రాగు నీటి సమస్య నుంచి రోడ్లు, వీధిలైట్లు వరకు అనేక సమస్యలు ఆ గ్రామల ప్రజలను ఏళ్ల తెరపడి వెంటాడుతున్నాయని, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాలలో ఎన్నికల లేకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే నిధులు సైతం అందటం లేదని, ప్రజాస్వామ్యంలో ఇంతకాలం ఎన్నికలకు ప్రజలను దూరం చేయటం ఎంత మాత్రం క్షమార్హం కాదని ఆయన అన్నారు. పార్లమెంట్ ఇన్చార్జి రంబాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలోనే ఈ గ్రామాలను కార్పొరేషన్ పరిధిలో కలిపి ఎన్నికలు జరిపే విధంగా చూడాలని అప్పటి ఏపీ ఎన్నికల చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ కి ఇప్పటి ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని అలాగే ఈ గ్రామాల విలీనంపై కొందరు న్యాయస్థానాలకు వెళ్లారని, వారిని ఒప్పించి న్యాయస్థానాల్లో కేసులను ఉపసంహరించుకునేలా చేయడంలో గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు సైతం వైఫల్యం చెందారని, కాకినాడ 42 ,48 డివిజన్లో న్యాయస్థానంలో కేసులకు ముందుకు తీసుకువెళ్లడంలో సైతం కాకినాడ కార్పొరేషన్ న్యాయవాదులు వైఫల్యం చెందారని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కేసుల పరిష్కారం కోసం న్యాయస్థానంలో కార్పొరేషన్ న్యాయవాదులు కృషి చేయాలని రంబాల కోరారు.

బిజెపి సీనియర్ నేత మీడియా ప్యానలిస్ట్ దువ్వూరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రూరల్‌లోని ఆరు గ్రామాలు గ్రామాల విలీనం జరిపిన తర్వాతే కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు జరపాలని తాను ఇంతకుముందే స్టేట్ ఎలక్షన్ కమిషన్కు లేక రాయడం జరిగిందని, ఈ లేఖపై అవసరమైన చర్యలు ప్రతిస్పందన కనిపించలేదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కవికొండలభీమశంకర్,నందూరి సత్తిబాబు, పెండెం సత్యనారాయణ, అనపర్తి వెంకటేష్,ఢిల్లీ నాయుడు,సలాది అనిల్, కాదామూర్తి, బల్ల సుధాకర్, పారుపల్లి లక్ష్మణరావు తో పాటు అనేక గ్రామాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళా సర్పంచ్ మృతి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలోని తేటగుంట ప్రాంతంలో గడచిన గురువారం మధ్యాహ్నం ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో క్రిందపడి తలకు తీవ్ర గాయమైన సామర్లకోట మండలం వికేరాయపురం గ్రామ సర్పంచ్ మోర్త పూర్ణిమ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సర్పంచి పూర్ణిమ తన పెద్దబ్బాయితో కలిసి గత గురువారం వికె రాయపురం నుంచి పెద్ద కుమారుని ఇంటికి తుని ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వెళ్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పిన రోడ్డు పక్కన ఉన్న చిన్నగోతిలో మోటారు సైకిల్ పడి వారు రోడ్డుపై పడ్డాయి. దీంతో వెనక కూర్చుని ఉన్న సర్పంచ్ పూర్ణిమకు తలకు తీవ్ర గయాలయ్యాయి. దానితో ఆమెను ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచనల మేరకు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా గత రెండు రోజులగా చికిత్స పొందుతున్న సర్పంచ్ మృతి చెందినట్లు బంధువులు తెలియ జేశారు. కాగా మహిళా సర్పంచి పూర్ణిమ అకాల మృతిపట్ల మండల పరిధిలోని పలువురు సర్పంచిలు, మండల పరిషత్, రెవెన్యూ అధికారులు తీవ్ర సంతాపం తెలిపారు.

## నేడు ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ( పీజీఆర్ఎస్) కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ హాలు నందు ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 1:00 వరకు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు. అదేవిధంగా రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంఅన్నిమండలాల్లో సోమవారం ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు ఉదయం 9.30 నిమిషాలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వ్యవస్థ

**– 9.30.కి డయల్ యువర్ కమిషనర్**

**– సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచన**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం పదిన్నర గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. స్థానిక శారదాదేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. అలాగే ఉదయం 9:30 నుంచి పదిన్నర వరకు డయల్ యువర్‌కమిషనర్‌కార్యక్రమాన్నికూడా నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేషన్ కార్యాలయ ఫోన్ నెంబర్ 0884-2357800 కు సమస్యలు తెలియజేయవచ్చునని కమిషనర్ సూచించారు. డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజలుతమసమస్యలనుతెలియజేయవచ్చునని కమిషనర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

## జూలై 29 సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం రద్దు

**– అధికారులందరూ వరద సహాయక చర్యలలో నిమగ్నం**

**– జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**

**అమలాపురం, మేజర్ న్యూస్ :** 'గోదావరి పరివాహక ప్రాంతాలలో భారీ వర్షాల కారణంగా ధవలేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద నీరు చేరి దిగువకు వరద నీటిని విడుదల చేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో జిల్లా, మండల గ్రామ స్థాయి అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బంది అందరూ సహాయక చర్యలలో నిమగ్నమై ఉన్నందున జూలై 29 సోమవారం జరగవలసిన జిల్లా, డివిజన్, మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమం రద్దు చేయబడింది' అని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆగస్టు 2 నుంచి డీఎస్సీ ఉచిత కోచింగ్ జిల్లా కలెక్టర్‌తో ప్రారంభం

**– జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**





**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక గోకవరం రోడ్డులోని కాపు కళ్యాణ మండపం వద్ద జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభించేందుకు అక్కడ మౌలిక వసతులు కల్పించడానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజులుగా డీఎస్సీ కోచింగ్ అప్లికేషన్లు 432 మంది అప్లికేషన్లు తీసుకోవడం జరిగిందని వీరందరికీ ఆదిత్య, గోదావరి, గైట్ వంటి వాటితో పోటీ పడేవిధంగా బెస్ట్ ఫెకాలటి ఇవ్వడం జరుగుతుందని వీరందరికీ కోచింగ్ తో పాటు ఉచిత భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేయడం జరిగిందని నియోజవర్గంలోనిఈ కోచింగ్ తీసుకున్న నూటికి 70 మందిఅయినా టీచర్ పోస్టులు సాధించాలని ఒక ఆకాంక్షతో ఈకార్యక్రమంతీసుకోవడంజరిగిందని తెలియజేశారు. ఆగస్టు రెండో తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ కోచింగ్ సెంటర్ ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్అప్పలరాజు,మారిశెట్టిభద్రం,జీను మణి బాబు, దేవరపల్లి మూర్తి, ముసిరెడ్డి నాగేశ్వరరావు, రాయి సాయి, నేదురు గణేష్, వైభోగుల శ్రీనివాస్ యాదవ్, నండ్ల చిరంజీవి, హరి గోపాల్,మారుతి,పిటిప్రసాద్,పుర్రెసూరన్న, తదితరులు పాల్గొన్నారు.

# జవాబుదారీ తనమా నీ జాడ ఎక్కడ ?

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** గత వైసిపి జగన్ ప్రభుత్వంలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అనపర్తి నియోజకవర్గంలో అక్రమ వెంచర్లు వెలిసాయి .. ఎలాంటి అనుమతులు లేకుండా, కనీసం భూమార్పిడి చేయకుండా నాన్ లేఅవుట్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఖజానాకి చిల్లిగవ్వ చెల్లించకుండా, 10 శాతం సామాజిక స్థలాలు వదలకుండా ప్లాట్లు అమ్ముకుని రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇలాగే రంగపేట మండలం వడిశలేరు గ్రామ పంచాయితీ పరిధిలో గరికిపాటి డవలపర్స్ గత ప్రభుత్వ అనపర్తి ఎమ్మెల్యే అండతో బరితెగించారు. నేడు సూర్య జాతీయ పత్రికలో కథనాలతో కదలిన డిపివో దాసరి రాంబాబు, ఇతర క్రిందిస్థాయి అధికారులు అక్రమాలపై చర్యలకు దిగడంతో వారిపై యాజమాన్యం బెదిరింపులకు దిగినట్లు తెలుస్తోంది.

జాతీయ దినపత్రిక సూర్య లో గ్రీన్ విలేజ్ ఫాం ల్యాండ్ అక్రమాలపై అక్షర పోరాటం చేస్తూ సంచలన కథనాలతో గ్రీన్ విలేజ్ అక్రమాలను వెలుగులోకి తెచ్చింది. కథనాలపై స్పందించిన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చర్యలు ఆదేశాలు జారీ చేశారు. రుడా విసి బాలస్వామి ఆర్‌ఓసి నెం.411 ద్వారా పంచాయితీ కార్యదర్శిని జీవో నెం.443 ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎలక్ట్రికల్ ఎస్ఇ కి, రిజిస్ట్రేషన్ శాఖలకు సర్వే నెంబర్లు పంపి కరెంటు సర్వీసు ఇవ్వరాదని, ఆయా సర్వే నెంబర్లలో రిజిస్ట్రేషన్లు చేయరాదని రుడా విసి బాలస్వామి కోరారు. ఇన్‌చార్జి పంచాయితీ కార్యదర్శి సుబ్బారాయుడు గత శనివారం విఆర్‌వో, ఇతర సిబ్బందితో కలిసి ఫాం ల్యాండ్ వెంచర్‌లో గోడలకి మూడో నోటీసు అంటించి జారీ చేశారు. దాంతో ఆగ్రహించిన గరికిపాటి వెంకటేశ్వరరావు అధికారులను ఓ ఎమ్మెల్యే పేరు చెప్పి తీవ్రంగా బెదిరించినట్లు చెబుతున్నారు. తాను కోటీశ్వరుడని, నన్ను ఎవరూ పీకలేరని నీ అంత చూస్తానని చెప్పినట్లు చెబుతున్నారు. అయితే నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే ఎంతటివారికైనా శిక్ష తప్పదు. గత వైసిపి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి అండతో గరికపాటి డెవలపర్స్ బరితెగించారు. సుమారు 40 ఎకరాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా ఫామ్ ల్యాండ్ వెంచర్ అనధికారికంగా వేసేశారు. ప్రభుత్వ ఖజానాకి కట్టాల్సిన లక్షలాది రూపాయలు చెల్లించకుండా, ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా, 10 శాతం అనగా సుమారు 4 యకరాల భూమి సామాజిక స్థలంగా పంచాయితీకి వ్రాసి ఇవ్వకుండా అంటే నాలుగు ఎకరాలు మార్కెట్ విలువ సుమారు నాలుగు కోట్లు అలాగే 60, 40 అడుగుల రోడ్లు లను విడదీయకుండా , ప్రతీ ప్లాటుకు ఇంటింటి కుళాయి బిగించకుండా, పార్కులు ఇతర సౌకర్యాలు నాణ్యతతో ఇవ్వకుండా, ధనార్జనే ధ్యేయంగా అమాయకులను మోసం చేయడానికి మార్కెట్లో అమ్మకానికి బయలుదేరిన ఈ యాజమాన్యం ఏర్పాటు చేసిన గ్రీన్ విలేజ్ ఫాం ల్యాండ్ వెంచర్‌పై కఠిన చర్యలు తప్పవని, దానికి అనపర్తి నియోజకవర్గ నిజాయితీ గల బిజెపి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్రమార్కులపై కఠిన చర్యలకు సహకరిస్తారని ప్రజలు అంటున్నారు. ఏమి జరుగుతుందో వేచి చూద్దాం...

## ఉచిత వైద్య శిబిరంలో 160మందికి వైద్య సేవలు - రోగులకు అన్నదానం





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమండ్రి వారి అధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియచేసారు. ఈ వైద్య శిబిరంలో డా. టి.వి.సుబ్బారావు, డా. దాసరి ఉమ మహేష్, డా. ఎస్. సంపత్ కుమార్ పాల్గొని సుమారు 160 మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలియచేసారు. ఈ వైద్య శిబిరంలో అవసరమైనవారికి 57మందికి రక్తపరీక్షలు, 06 గురికి థైరాయిడ్ పరీక్షలు, 18మందికి ఫిజియథెరపీ, 6గురుకి ఎక్స్ రే లు చేసినట్లు స్వామీజి తెలిపారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ విజ్ఞప్తి చేశారు. ఈ వైద్య శిబిరంలో మెడికల్ క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్లు వెంకటలక్ష్మి, సంజయ్, నాయుడు, రామకృష్ణ, రవితేజ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి హాజరైన రోగులకు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు.

## ఏజెన్సీలో హాస్టల్స్, కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ప్రపంచ ఆదివాసీ దినోత్సవ రోజుని సెలవు దినంగా ప్రకటించడంతో పాటు సమస్యల సుడిగుండంలో ఉన్న ఏజెన్సీ హాస్టళ్లు, కాలేజీ సమస్యలు పరిష్కరించాలని ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ.) రంపచోడవరం ప్రాంతీయ విస్తృత సమావేశం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ సమావేశానికి గణేష్ అధ్యక్షత వహించగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా సంఘం బృందం హాస్టళ్ళు, కళాశాలలో సందర్శించి విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నమని అన్నారు. ఈ పర్యటనలో విద్యార్థులు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. జూనియర్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్ లేక అడ్మినిస్ట్రేషన్ అస్తవ్యస్తంగా ఉందని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం జూనియర్ కళాశాలలో అమలు చేయాలనీ కోరారు. హాస్టల్లో పౌష్టికాహార లోపంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదొర్కుంటున్నారన్నారు. హాస్టళ్లలో మెనూ అమలులో లోపాలు ఉన్నాయని తెలిపారు. హాస్టళ్ల ఉన్నత అధికారుల పర్యవేక్షణా లోపం తీవ్రంగ ఉందని వాపోయారు. గిరిజన వసతి గృహాలకు హెల్త్ వాలంటర్లను నియమించామని కోరారు. డిగ్రీ కళాశాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆగష్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజు ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు, హక్కుల దినోత్సవం జరుపుకుంటారని కావున సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.**రంపచోడవరం ప్రాంతీయ కమిటీ ఎన్నిక..**విస్తృత సమావేశంలో ఎస్ఎఫ్ఐ ప్రాంతీయ కమిటీని వచ్చిన ప్రతినిధులు ఎన్నుకొన్నారు. నూతన కమిటీ 16 మందితో వేయడం జరిగింది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సోడే గణేష్, సోడే వినోద్ ఎంపిక కాగా విద్యార్థినులు కన్వీనర్లుగా స్పందన, సౌజన్య, ఎంపిక కాగా రాహుల్, దేవేంద్ర రెడ్డి, సారథి, సాయి తేజలు ఆఫీస్ బేరర్స్‌గా ఎంపికయ్యారని ప్రకటించారు.

## దారుణం.. తల్లి కళ్లముందే ముగ్గురు కుమారులను మింగేసిన మృత్యువు.. ఏం జరిగిందంటే..?



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గండేపల్లి మండలం జగ్గంపేట సమీపంలోని జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో బైక్ మీద వెళ్తున్న ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బైక్ పై నలుగురు ప్రయాణిస్తున్నారని తెలిసింది. బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం మండలం తాడేరుకు చెందిన నంగలం దుర్గ అనే మహిళకు ముగ్గురు కుమారులు. దుర్గ, ఆమె కుమారులు కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే పని కోసమని నర్సీపట్నం వెళ్లిన తల్లీ కొడుకులు.. బైక్‌పై స్వగ్రామానికి తిరిగొస్తుండగా ప్రమాదం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో గండేపల్లి మండలం మురారి శివారులో వీరు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పడంతో వారంతా కిందపడ్డారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరి పైనుంచి వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదంలోదుర్గ కుమారులు ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. తల్లికి తీవ్ర గాయాలు కావడంతో ఆమెను సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఘటనాస్థలానికి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

## విధ్యార్థినిలకు ఉచిత వైద్య శిబిరం




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఆదివారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు తూర్పు గోదావరి జిల్లా డి.ఎం.హెచ్.వో. వారి సమన్వయంతో స్థానిక గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల దగ్గర ఉన్న ఎస్.టి మహిళా హాస్టల్ నందు విధ్యార్థినిలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రకాష్‌బాబు విధ్యార్థినిలతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో ఈ.సీ.జీ, బీ.పీ, షుగర్, హెమోగ్లోబిన్ మొదలగు పరీక్షలు నిర్వహిస్తున్నామని, విధ్యార్థినిలందరు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. పరీక్షల అనంతరం విధ్యార్థినిలకు మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో మెడికల్ ఆఫీసర్ డి.అలేఖ్య, స్టాఫ్ నర్స్ కె.శారద, ల్యాబ్ టెక్నీషియన్ వై.బాలదుర్గా, ఏ.ఎన్.ఎం రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు కె.బేబీ, కె.కరుణతో పాటు హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మునిగిన పంటపొలాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్న మంత్రుల బృందం



**నిడదవోలు, మేజర్ న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గం ఎర్ర కాల్వ వరద ముంపు ప్రాంతాలైన సూర్యారావు పాలెం, పసులపూడి, కాల్దారి గ్రామాల్లోని ఎర్ర కాలవ వరద ఉధృతి వలన నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి రైతుల నుంచి వివరాలను మంత్రుల బృందం తెలుసుకుంటున్నారు. పర్యటనలో వ్యవసాయ శాఖామంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర హెూం శాఖామంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, మాజీ శాసనసభ్యులు బూరుగుపూడి శేషారావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చంనాయుడు మంత్రుల బృందం రైతులతో మాట్లాడుతూ ఎర్రకాలు వరద ఉధృతి వలన గురై పంట పొలాలు నీట మునిగిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఎర్ర కాలువ వలన తరచూ ఈ ప్రాంతం ముంపు, గత 12 ఏళ్లగా ఇబ్బందులు పడుతున్న రైతాంగం శాశ్వత పరిష్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం జరుగుతుందని మంత్రి అచ్చం నాయుడు హామీ ఇచ్చారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ, వ్యవసాయ అధికారులు, స్థానిక రైతులు తదితరులు ఉన్నారు.



## నవోదయ ప్రవేశ పరీక్షకు 5వ తరగతి విద్యార్థులందరికి అవకాశాలు కల్పించాలి

పెద్దాపురం, మేజర్ న్యూస్ : కేంద్ర ప్రభుత్వం నిర్వహణలో ఉన్న నవోదయ పాఠశాలల ప్రవేశ పరీక్ష వ్రాయుటలో చాలా మంది విద్యార్థులకు నష్టం కలుగుతుందని, ప్రభుత్వం విద్యార్థుల వయసు ది.1-5-2013 నుండి 31-7-2015 మధ్య జన్మించి ఉండాలి, ఆ తరువాత జన్మించిన వార్కి అవకాశం లేదని, కాని కొన్ని పాఠశాలల్లో ది.31-08-2015 వరకు 5వ తరగతిలో జాయిన్ చేసుకుంటారు కావున ది.31-07-2015 కాకుండా ది.31-08-2015 వరకు అవకాశం ఇస్తే రెండు తెలుగు రాష్ట్రాలో విద్యార్థులకు అవకాశం వస్తుందని, కొంతమంది తల్లితండ్రులు తెలిపారు. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు.

## నేడు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

**– ముఖ్య అతిధిగా పాలొననున్న ఎమ్మెల్యే చినరాజప్ప**



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో స్థానిక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమం ఉదయం 9 గంటలకు నిర్వహించబడునని మండల విద్యాశాఖాధికారి ప్రభాకరశర్మ,వి.ఆర్.కె.చౌదరిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ ఈ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగపెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప పాల్గొననున్నారని, వారు తెలిపారు.

# పటిష్ట ప్రణాళికతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి

**– స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం**
**– అత్యంత నాణ్యవంతంగా ప్రజా ప్రయోజన పనులు**
**– గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి**
**– రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ**

**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** సమష్టి భాగస్వామ్యం, సమన్వయంతో పిఠాపురం నియోజకవర్గంఅభివృద్ధికికృషిచేయాలనిరాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ అన్నారు. పిఠాపురంనియోజకవర్గం పర్యటనలో భాగంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజ ఆదివారం పిఠాపురం ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్డీఏ, పంచాయతీరాజ్, జిల్లా పరిషత్తు, డ్వామా తదితర విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. పింఛన్ల పంపిణీకి అనుసరిస్తున్న విధానం, సీసీ రోడ్లు, డ్రైన్స్, ఇతర నిర్మాణ పనులు, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు, సీపీడబ్ల్యూ పథకం పనులు, తాగు నీరు శుద్ధి, పారిశుధ్యం వంటి కార్యక్రమాలు అమలు తీరు, పనుల పురోగతిని ఈ సందర్భంగా ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలుతపీఆర్‌అండ్‌ఆర్డీడైరెక్టర్‌కృష్ణతేజ.. అధికారులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కను నాటారు.



ఈసందర్భంగాఆయనమాట్లాడుతూ...వివిధశాఖలసమష్టి భాగస్వామ్యం, సమన్వయంతో పిఠాపురం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీలలో పూడికలు తొలిగింపునకు చర్యలుచేపట్టాలన్నారు.సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు సమగ్రమైన ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలోఉమ్మడితూర్పుగోదావరిజిల్లా ప్రజాపరిషత్ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, డీపీవో కె.భారతిసౌజన్య,పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మల్లిఖార్జున రావు, పెద్దాపురం డీఎల్డీవోలు పీ.నారాయణ మూర్తి, కెవిఎస్వీ ప్రసాద్ రావు, ఎంపీడీవోలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

–సర్పంచులతో సమావేశం...అధికారులతో సమీక్ష అనంతరం పిఠాపురం నియోజకవర్గంలోని సర్పంచులతో పీఆర్, ఆర్డీ డైరెక్టర్ కృష్ణతేజ సమావేశమయ్యారు. సర్పంచులతో మాట్లాడి గ్రామాల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైన్స్ నిర్మాణం, ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహకాలు,జనాభా ప్రాతిపదికన గ్రామాల్లోడంపింగ్‌యార్డులుఏర్పాటు,పారిశుద్ధ్యకార్మికులు, పంచాయతీల విద్యుత్ బాకాయిలు, శివారు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన, పంచాయతీలలో సిబ్బంది కొరత, వీధిలైట్లు నిర్వహణ వంటి సమస్యలను సర్పంచులు.. డైరెక్టర్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామస్థాయిలో పరిమితులను దృష్టిలో ఉంచుకొని అన్నిగ్రామాలఅభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారానికి తాను తరుచుగా గ్రామాల్లో పర్యటిస్తానన్నారు. గ్రామ స్థాయిలోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని ఆయన సర్పంచ్‌లకుభరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తమ గ్రామ సమస్యలపై సర్పంచులు ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

## సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం



సామర్లకోట, మేజర్ న్యూస్ : అక్రమ తొలగించిన కార్మికులమైన తమను విధుల్లోకి తీసుకుని సమస్యను పరిష్కరించే వరకూ నిరసన కొనసాగిస్తామని రాక్ కార్మికులు హెచ్చరించారు. సిరామిక్స్ పరిశ్రమ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో రాక్ సిరామిక్స్ కార్మికులు చేపడుతున్న నిరసన కార్యక్రమాలు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు గంగాధర్ మాట్లాడుతూ తమను విధుల నుండి తొలగించి 104 రోజులు అవుతుందని, పోరాటం ప్రారంభించి 40 రోజులు అయ్యిందన్నారు. కార్మికులను అక్రమంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా యాజమాన్యం తొలగించిందన్నారు. 5 సార్లు జాయింట్ లేబర్ కమిషనర్ వద్ద చర్చలు జరిగినా యాజమాన్యం మంకుపట్టుదలతో వ్యవహరి స్తుందన్నారు. కార్మిక చట్టాలను పాటించకుండా వ్యవహరిస్తుందని విమర్శించారు .రాష్ట్ర కార్మిక శాఖ మంత్రికి కూడా కంపెనీ యాజమాన్యం అబద్దాలు చెబుతున్నదని ఎద్దేవ చేసారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, భాధిత కార్మికులు చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, మంగారావు, అర్జున్ రావు, మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న, ప్రభుదాస్, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్ కుమార్, శివ నారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## 104 డ్రైవర్‌కి ఆర్థిక సాయం



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** 104 డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న సువర్ణ రాజుకి ఎపి 104 ఉద్యోగుల సంఘం తరపున ఆదివారం మండలం లోని ఎఫ్ కె పాలెం గ్రామంలో ఆయన నివాసంలో ఆర్థిక సాయం అందజేశారు. తోటి ఉద్యోగస్తుడు ఆరోగ్య పరిస్థితి బాగోలేదని చెప్పగానే స్పందించి రూ. 20 వేలు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని సిఐటియు నాయకులు కరణం విశ్వనాధం, కాకినాడ జిల్లా జనరల్ సెక్రెటరీ ఎం త్రిమూర్తులు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. వెంకట్రావు అన్నారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడటమే కాకుండా వారు ఆపదలో ఉన్నప్పుడు సంఘం అండగా నిలుస్తుందన్నారు. ఆర్థిక సాయం అందించిన 104 ఉద్యోగుల సంఘం సభ్యులందరికీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సిహెచ్ శ్రీను, కమిటీ సభ్యులు హరి ప్రసాద్, స్వర్ణ తేజ, సతీష్, రాఘవ తదితరులు ఉన్నారు.

## వెంకన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు





**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిహారి కుటుంబ సమేతంగా దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి విశిష్టత గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సూపరిండెంట్ శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం అందించారు.

## నూకాంబికా అమ్మవారికి శాఖంబారి అలంకారం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఆషాఢమాస పర్వదినాలు సందర్భంగా సామర్లకోట గ్రామ దేవత అయిన స్టేషన్ సెంటర్ లోని నూకాంబికా అమ్మవారిని ఆదివారం శాఖంబరి మాతగా ప్రత్యేక పూజలు చేపట్టారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకాంభరీ అమ్మవారిగా సర్వ సుందరంగా అలంకరించారు. దీపారాధన సంఘ సభ్యులచే అమ్మవారికి కూరగాయలను, నిమ్మకాయాలను మాలలుగా రూపొందించి అలంకరించారు. సామర్లకోట పరిసర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ నాయకులు పాల్గొని సేవలనందించారు.

# నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు సమగ్ర ప్రణాళిక



**– ఆక్రమణల విషయంలో తొలగింపు చర్యలు తీసుకోవడం జరుగుతుంది**
**– ట్రాఫిక్ డి ఎస్పీ వేంకటేశ్వర రావుతో కలిసి నగరంలో తనిఖీలు చేపట్టాం**
**– కమిషనర్ కేతన్ గార్గ్**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఆక్రమణల తొలగింపు నేపధ్యంలో పోలీసు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ టీం ఏర్పాటు చేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. ఆదివారం నగర పాలక సంస్థ అధికారులు పోలీసులు అధికారులతో కలిసి నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ పూర్తి నియంత్రణ నేపధ్యంలో క్రమబద్ధీకరణ చేయాల్సి ఉందన్నారు. అందుకు అనుగుణంగా రూట్ మ్యాప్ సిద్ధం చేసి ఆక్రమణ తొలగింపులకు సంబంధించి సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. నగరంలోని అన్ని సిటీ కెమెరాలను పనిచేసే విధంగా అన్నారు. 2027లో రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని యాక్షన్ ప్లాన్ రూపొందించాలని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం ఆమోదించిన ప్లాన్‌ను అనుసరించి నిర్మాణాలు ఉండాలని, రహదారుల ఆక్రమణ చేసి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని పేర్కొన్నారు. నగరంలో ఆటోలకు, వాహనాలకు నిర్దేశించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం వసూలు చేస్తామని అన్నారు. పలువురు ఆటో డ్రైవర్లకు కమిషనర్ అవగాహన కలుగ చేశారు.

## మరిడమ్మ దేవస్థానం వద్ద పూర్వ విద్యార్థులు పులిహోర పంపిణి



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి ఆషాఢ మాస జాతర మహోత్సవాల సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద ఆదివారం పెద్దాపురం మహారాణి కళాశాల 1988-91 (బి.కామ్ బి సెక్షన్) పూర్వ విద్యార్థులు ప్రతీ సంవత్సరం చేసే కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం కూడా అమ్మవారి దేవస్థానానికి వచ్చే భక్తులకు పులిహోర, వాటర్, చిన్నపిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాబోలు సత్య ప్రసాద్ (ఆటోమొబైల్), ఆర్.వి.సత్య నారాయణ, ప్రతాప్ సింహ, ప్రకాష్, శ్రీను, వెంకటేశ్వరరావు, అప్పారావు, డి.వి.డి.సత్య నారాయణ, పైడా నానాజీ, జగ్గారావు, కె.వి.వి.సత్యనారాయణ, వసంతరావు, సోమరాజు, కర్రి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర సమయంలో అధికారుల నిర్లక్ష్యం తగదు..



కూనవరం, మేజర్ న్యూస్ : గోదావరి వరద బాధితుల్ని ఆదుకోవడంలో అధికారులు విఫలం అయ్యారని వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య అన్నారు.కోడేరు బొజ్జరాయిగూడెం మధ్యలో వరద నీరు నిలిచి మూడు గ్రామాలకు రాక పోకలు నిలిచి పోయాయని అన్నారు. మూడు రోజులగా అత్యవసర పరిస్థితి లో ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి లో ఉన్నారని అన్నారు. కనీసం బోట్ ఏర్పాటు చేయలేదని అన్నారు. ఏర్పాటు చేసిన బోటు చింతూరుకి సంబంధించిన అధికారులు వాడుతున్నారని అన్నారు. వారికి వచ్చే నిత్యావసరాలు తీసుకెళ్లాలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు.మూడు రోజులుగా విద్యుత్ లేదని అన్నారు. ఈ విషయమై అనేక మార్లు ఐ.టీ. డి. ఏ. ప్రాజెక్ట్ అధికారి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. కనీసం కొవ్వత్తులు ఇవ్వాలేదని అన్నారు. టార్పల్ బరకాలు,ఇవ్వలేదని అన్నారు తక్షణమే అధికారులు స్పందించి వరద బాధితులకి సహాయం అందిఇంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, శారద, నాగమ్మ,, సుబ్బమ్మ, లాలమ్మ,, సూర్య కాంతం మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విలీన మండలాలను నిండా ముంచిన గోదావరి



కూనవరం, మేజర్ న్యూస్ : కూనవరం వద్ద గోదావరి వరద ఉధృతి అత్యంత ప్రమాద స్థాయిలో ప్రవహించి ఆదివారం మధ్యాహ్నం వరకు వరద పెరుగ కొనసాగుతుంద 506 అడుగుల వరకు చేరుకొంది. దీని మూలంగా మండలంలో వందల కొలది ఇల్లు నీట మునిగ నవి 15 రోజుల వ్యవధిలోనే కూనవరం వద్ద మూడుసార్లు మూడవ ప్రమాద హెచ్చరిక దాటి వరద ప్రవహించింది. భద్రాచలం వద్ద సాయంత్రం ఐదు గంటలకు మూడవ ప్రమాద హెచ్చరిక 53 అడుగులు దాటి ప్రవహిస్తుంది. ఇంద్రావతి, శబరి, తాలిపేరు ఉపనదుల వద్ద వర్షాలు కురవడంతో గోదావరి వరద ప్రవాహం పోటెత్తిందని అధికారులు తెలిపారు. శబరి గోదావరి సంఘము వద్ద ఎటు చూసినా వరద నీరే ఉధృతంగా ప్రవహిస్తుంది. కూనవరం నుంచి విఆర్ పురం వెళ్లే శబరి బ్రిడ్జి ఆనుకొని వరద ప్రవహిస్తుంది.కూనవరం నుంచి విఆర్ పురం,చింతూరు, భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారుల పైకి వరద నీరు చేరడంతో మండలం జలదిగ్బంధంలో చిక్కుకుంది. కూనవరం వెళ్లేందుకు అధికారులు పడవలను ఏర్పాటు చేయటంతో వరద బాధితులు నిత్యసర సరుకులు కోసం భీమవరం వచ్చి వెళుతున్నారు.వారం రోజులుగా కాండ్రాజుపేట, పండ్రాజుపల్లి,పొలిపాక, దూగుట్ట, కొండాయిగూడెం రహదారులను వరద ముంచి వేయడంతో ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వరద ముంపుతో ముంపు గ్రామాల ప్రజలు తల్లడిల్లి పోతున్నారు. ఈ వరద కష్టాలు మేం భరించ లేం అంటూ గగ్గోలు పెడుతున్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం మా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల గోడును అర్థం చేసుకొని మెరుగైన పరిహారాలు అందించి తమను ఖాళీ చేయించి ఆదుకోవాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. ఈ సంవత్సరం అధికారుల తీరు పని విధానం బోట్లు నియంత్రణ క్రమశిక్షణగా జరిగింది. కూనవరం ఎస్సై శ్రీనివాసరావు ఈవో సురేష్ విద్యుత్ శాఖ అధికారులు వైద్య సిబ్బంది తమ విధులను బాధ్యతగా వ్యవహరించినట్లు తెలుస్తోంది.

## డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీష దేవి




**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్:** డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గ శాసనసభ్యులు మిరియాల శిరీష దేవి దోమల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైన్ సీజన్ కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో మలేరియా సిబ్బంది ప్రజలకుతెలియజేయాలన్నారు. అలానే గ్రామాల్లోదోమల ముందు పిచికారి చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి దోమ తెరలు అందజేయాలన్నారు. కాచీ, చల్లార్చిన, వడబోసిన మంచి నీటినే తీసుకోవాలని అవగాహన కల్పించారు.
–ప్రజా క్షేమమే మన క్షేమం, ఆరోగ్యమే మహాభాగ్యం
మన పంతం –దోమల అంతం, దోమపుట్టరాదు–దోమకుట్టరాదు" చిన్న కాటు –పెద్ద ముప్పు అనే నినాదాలు ఎమ్మెల్యే, మండల స్థాయి అధికారుల సమక్షంలో మలేరియా సిబ్బంది చేశారు. రాజవొమ్మంగి మండలాన్ని మలేరియా, డెంగ్యూరహితమండలంగా చూడాలని ఎమ్మెల్యే శిరీష దేవి అన్నారు. మండల పరిషత్ సమావేశపు హాలు నందు ఎంపీడీవో యాదగిరి ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మఠం విజయభాస్కర్, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పిటిసి జ్యోతి, డి శివ రామచంద్ర రాజు, గొల్లపూడి పెద్దిరాజు, గణజాల తాతారావు, నల్లా సత్యనారాయణ, మండల స్థాయి అధికారులు, ఎంఎస్ఓ సిహెచ్ ప్రసాద్ ఉన్నారు.

## మరిడమ్మ అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

**– దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాట్లు**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి ఆషాఢ మాస జాతర మహోత్సవాల సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించ బడుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం వేలాది సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకోవడం జరిగింది. దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ్మోహనరావు, ఛైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా క్యూలైన్ల ఏర్పాటు, క్యూలైన్‌లో భక్తులకు మంచినీటి సౌకర్యంతో పాటు, చిన్న పిల్లలకు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో పాలు పంపిణీ చేయడం జరిగింది. అలాగే శానిటేషన్ సిబ్బందితో దేవస్థానం ఆవరణలో మరియు పరిసర ప్రాంతాలలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడం జరిగింది. పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ సిబ్బంది ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్ కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ తదితరులు ఉన్నారు.

## పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని జడ్డంగి, రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ల పరిధి లోని ఆదివారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ సన్యాసినాయుడు విలేకరులకు తెలిపారు. వారోత్సవాలు ఈనెల 28 నుండి ఆగస్టు 3 వరకు ఉండ నున్నట్లు ప్రముఖులు ముఖ్యమైన వ్యక్తులు, మావోయిస్టు హిట్ లిస్ట్‌లో వున్నవారు, మారుమూల గ్రామాలకు వెళ్లకూడదని వారంతా మైదాన ప్రాంతాలలో వుండాలని తెలియజేసామన్నారు. పోలీసుస్టేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వుండాలని సూచనలు చేశారు. .కొత్త వ్యక్తులు అలానేఅనుమానితులు గాని గ్రామాలలో సంచరించి నట్లయితే వెంటనే పోలీస్ లకు సమాచారం ఇవ్వాలన్నారు. జడ్డంగి స్టేషన్ పరిధిలోనిలోదొడ్డివెళ్లే రహదారిలో సీఐ సన్యాసినాయుడు, ఎస్సై రఘునాథ రావులు ఏ పి ఎస్ పి సిబ్బందితో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టి రికార్డులు పరిశీలించారు. అలానే రాజవొమ్మంగి స్టేషన్ పరిధిలోని బోయపాడు జంక్షన్ వద్ద ఎస్సై వెంకయ్య ఏఆర్ పార్టీ సిబ్బందితో వాహన తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు.

## పునరావాస శిబిరాలకు తరలించాలి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** గౌతమి వశిష్ట గోదావరులకు వరద ఉధృతి అధికంగా ఉన్నందున వరద ముంపు ప్రాంతాలలో నివాసం ఉండేవారిని పునరావాస శిబిరాలకు తరలించాలని తాహసిల్దార్ వెంకటరామయ్య చౌదరి ఆదేశించారు. ఆదివారం బొబ్బర్లంక శివారు పిచ్చుకలంకలో ముంపుకు గురయ్యే ప్రాంతాలను పరిశీలించారు. బాధితులకు మెడికల్ క్యాంపు నిర్వహించడంతో పాటు తాగునీరు అందించాలని రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. రాత్రి వేళల్లో రక్షణ నిమిత్తం బొబ్బర్లంకలోని ఆర్.బి.కే. సెంటర్లో ఏర్పాటుచేసిన శిబిరానికి ముంపు గురయ్యు ప్రాంతవాసులను తరలించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ భవాని తదితరులు ఉన్నారు

# విద్యకు ప్రభుత్వం పెద్దపేట -ఎమ్మెల్యే నల్లమిల్లి



**అనపర్తి,మేజర్‌న్యూస్ :**విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రభుత్వంతోపాటు పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనపర్తి పాత ఊర్లోని కర్రి అప్పారావు జిల్లా పరిషత్ వార్షికోత్సవ వేడుకలకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్య వ్యవస్థకు పెద్దపీట వేస్తుందని అన్నారు. విద్యతోటే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, గత ప్రభుత్వా నిర్వాకం వల్ల రాష్ట్రం అధిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ విద్య వ్యవస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ని సత్కరించారు. రామకృష్ణారెడ్డితో పాటు డాక్టర్‌సత్యనారాయణ మూర్తి ,డాక్టర్‌శ్రీనివాసరెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరద బాధితులకు తక్షణ సాయం అందజేత



**అల్లవరం, మేజర్ న్యూస్ :** బోడసకుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో వరద ముంపు ప్రాంతాలలో నిరాశ్రయులైన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వచ్చినటువంటి తక్షణ సహాయం (ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం.., కేజీనూనె.., కేజీ ఉల్లిపాయలు.., కేజీ బంగాళదుంపలు) ని లబ్ధిదారులకు అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సునీల్ కుమార్, ఎంపిడివో కృష్ణమోహన్, గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు సత్తిబాబు రాజు, పాలకవర్గ సభ్యులు అడపా శ్రీనివాస్, ఓలేటి పరమేశ్వరరావు, ఐల నాగేశ్వరరావు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు చింత శ్రీనివాస్, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ల శ్రీనివాస్, టిడిపి మండల యూత్ అధ్యక్షులు ముత్యాల బాబి, నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మండలానికి చెందిన నాయకులు, వివిధ గ్రామాల చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలు పరిష్కరించాలని వినతి

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గం యు కొత్తపల్లి మండలం నాగులపల్లి గ్రామ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణ తేజకు నాగులపల్లి ఉప సర్పంచ్ గుర్రాల చిరంజీవి కుమార్ వినతిపత్రం సమర్పించారు. పిఠాపురం రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం పిఠాపురం నియోజకవర్గంలోని సర్పంచులతో రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ వి.ఆర్ కృష్ణ తేజ గ్రామాల అభివృద్ధికి సంబంధించిన విషయాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగులపల్లి సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి నారాయణరెడ్డి సూచనతో హాజరైన నాగులపల్లి ఉపసర్పంచ్ గుర్రాల చిరంజీవి కుమార్ సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కాలంలో సర్పంచులు గ్రామాలలో అభివృద్ధి పనులకు చేయించుకోలేక ఉత్సాహ విగ్రహాల మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ చట్టంలో కాలం చెల్లిన నిబంధనల వల్ల సర్పంచులు, కార్యదర్శులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని పంచాయతీరాజ్ చట్టాన్ని అమెండ్మెంట్ చేయాల్సిన అవసరం ఉందని పంచాయతీరాజ్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అదేవిధంగా గ్రామీణ పారిశుద్ధ్య విషయంలో విధులు నిర్వహిస్తున్న స్కావెంజర్కిస్తున్న జీతాలు పెంచేలా కూడా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. అదేవిధంగా చాలా పంచాయతీలలో చాలా చివరి గ్రామాలు ఉండి ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని జనాభా ప్రాతిపదికన చివరి



గ్రామాలను కూడా పంచాయతీలుగా ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ కు సమావేశంలో నాగులపల్లి ఉపసర్పంచ్ చిరంజీవి విజ్ఞప్తి చేయడం జరిగింది. అనంతరం నాగులపల్లి గ్రామ సమస్యలు అయినా ఇళ్ల స్థలాల లెవెలింగ్ చేసి ఇల్లు కట్టుకునే విధంగా అర్హులకు ఇళ్ల స్థలాలను అప్పజెప్పాలని, ఏలేరు ముంపునకు గురవుతున్న ఎస్సీ పేట వద్ద వంతెన నిర్మాణం చేపట్టాలని అదేవిధంగా కాలువకు అటు ఇటు సపోర్టింగ్ వాల్స్ నిర్మించాలని, మంచినీటి చెరువు చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టాలని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, సినిమా సెంటర్ వద్ద ఉన్న గోపరాజు కాలువ మీద నిర్మించిన వంతెనను నాలుగు చక్రాల వాహనాలు వెళ్లే విధంగా పునర్ నిర్మించాలని, పొలాలలోకి వెళ్లే పుంత రోడ్లకు గ్రావెల్ రోడ్లు వేయించాలని, రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని, పంచాయతీకి శాశ్వత ప్రాతిపదికన ఒక గుమస్తాను నియమించాలని, జల జీవన్ మిషన్లో అసంతృప్తిగా ఉన్న పనులను పూర్తి చేయించాలని, ఎస్సీ, బిసి ఉప్పరగూడెం తదితర ప్రాంతాలలో సిసి రోడ్లు డ్రైనేజీలు నిర్మించాలని, ఉప్పరగూడెం గ్రామానికి స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని, ఉప్పరగూడెంలో మంచినీటి బోరు లేదా సంపు నిర్మించి జిఎస్ఎల్ ట్యాంకులను నిర్మించి సరిపడా మంచినీరు ఉప్పరగూడెం గ్రామస్తులకు అందేలా చర్యలు చేపట్టాలని, ఉప్పరగూడెం గ్రామాన్ని ఆనుకొని పేదల ఇళ్ల స్థలాల నిమిత్తం సేకరించిన భూమిలో ఉప్పరగూడెం గ్రామస్తులకు మాత్రమే స్థలాలు కేటాయించాలని, ఉప్పరగూడెం వద్ద ఉన్న బ్రిడ్జి వద్ద నుండి పెద్ద కళింగల వరకు ఉన్న రోడ్డును గ్రావెల్ తో పునర్ నిర్మించాలని, ఇసుకపల్లి ఉప్పరగూడెం నాగులపల్లి ఉప్పరగూడెం మధ్య ఉన్న రోడ్డు సిసి రోడ్డుగా ఏర్పాటు చేయాలని, ఉప్పరగూడెంలో సిసి రోడ్లు డ్రైనేజీలు నిర్మించాలని, ఉప్పరగూడెం ప్రైమరీ పాఠశాల నుండి నాగమ్మ పాకల వద్ద ఉన్న బీటీ రోడ్డు వరకు రోడ్డును సిసి రోడ్డుగా నిర్మించాలని తదితర సమస్యలను రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ వి ఆర్ కృష్ణ తేజ దృష్టికి ఉపసర్పంచ్ చిరంజీవి కుమార్ తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. పైన పేర్కొన్న సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కూడా కృష్ణ తేజకు ఉప సర్పంచ్ చిరంజీవి కుమార్ సమర్పించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## గోదావరిలో బోటు బోల్తా.. ఒకరి గల్లంతు..

– ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** మండలంలోని ఊడిమూడి లంక గ్రామంలో గోదావరి నదిపై పడవ బోల్తా ఘటన దురదృష్టకరమని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ అన్నారు. ఆయన పడవ ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తో కలిసి పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఊడిమూడి లంక వద్ద పడవ ఎప్పుడూ వెళ్లే దారిలో కాకుండా దగ్గరగా ఉండే దారిలో వెళ్లడం వలన ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించామన్నారు. ప్రమాదంలో గల్లంతయిన విజయ్ కుమార్ అనే వ్యక్తి లైఫ్ జాకెట్ సరిగ్గా ధరించకపోవడం వలన గల్లంతయినట్లు తెలిపారు. విజయ్ కుమార్ గల్లంతయాడని తెలుసుకున్న వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తం అయిందని, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారని తెలిపారు. విజయ్ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

## నేడు లంక గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్వాడీలకు సెలవు

– 'మీకోసం' కూడా రద్దు : జిల్లా కలెక్టర్

**భీమవరం,మేజర్ న్యూస్:** జిల్లాలో కొనసాగుతున్న గోదావరి వరద కారణంగా సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ "మీకోసం" రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అలాగే మండల, డివిజన్ స్థాయిలో జరగాల్సిన మీకోసం కార్యక్రమాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి ప్రాంతంలో వరద తాకిడికిగురైన మండలాల్లోని లంక గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీలకు కూడా సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

## ఆపదలో ఉన్నవారికి చేయూత

– ఫోటోగ్రాఫర్,మీ సేవ నిర్వాహకుడు తాటి బాలాజీ

**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** వేలేరుపాడు మండలానికి చెందిన రామవరం ఇప్పల గుంపు, కోటగుంపు, అల్లూరి సీతానగరం గ్రామాలలో వరదబాధితులైన 50 కుటుంబాలకు రైస్, నిత్యవసర సరుకులు, కూరగాయలు, బట్టలు అందించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్,మీసేవ నిర్వాహకుడు తాటి బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం ఆయా గ్రామాలలో వరద బాధితులను కలిసి వారికి ధైర్యాన్ని కల్పించేందుకు తనతోపాటు తన సహచరులు ఫోటోగ్రాఫర్స్ కృషి చేశారని వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాను చేసిన సేవకు వరద బాధితులు ఆనంద వ్యక్తం చేశారు. అలాగే తాటి బాలు చేసిన సహాయాన్ని పలువురు అతనిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మనీకే శ్రీను,ఏలూరు జిల్లా ఫోటోగ్రఫీ యూనియన్ పిఆర్ఓ ప్రదీప్,జీలుగుమిల్లి యూనియన్ మోషే తాటి భీమరాజు, కంటిపల్లి నాగేంద్ర,పిట్టా ప్రసాద్, గడ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏటిగట్టును పరిశీలించిన ఎమ్మెల్యే,ఆర్డీవో

**నర్సాపురం,మేజర్ న్యూస్ :** పట్టణంలోనిపొన్నపల్లి ప్రాంతంలో ఏటిగట్టు వద్ద గోదావరి వరద ఉధృతిని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఆర్డిఓ అచ్యుత అంబరీష్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఏటిగట్టు పరిరక్షణ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు 30 సైకిళ్లు పంపిణీ

– దాతృత్వం చాటుకున్న యువకుడు

**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్:** విద్యార్థులు సైకిల్ లేక, ఆటో తదితర సౌకర్యాలులేక స్కూలుకు నడిచి వెళ్తున్న ఇబ్బందులను గమనించిన యువకుడు దాతృత్వం చాటుకున్నాడు. మండలంలోని రుస్తుంబాధ పంచాయతీకి చెందిన చింతా ప్రభుదేవా అదే గ్రామానికి చెందిన30 మంది విద్యార్థిని, విద్యార్థులకు కొత్త సైకిళ్లను పంపిణీ చేశాడు. తాను నిర్వహిస్తున్న ఎక్లేసియా చర్చి ఏర్పాటు చేసి 14 సంవత్సరాల పూర్తిఅయ్యి,15వసంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంలో ఈ సైకిల్లను పంపిణీ చేసినట్లు ప్రభుదేవా తెలిపారు. ఆదివారం గ్రామస్తుల సమక్షంలో సైకిళ్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సూర్య ప్రతినిధితో ప్రభుదేవా మాట్లాడుతూ ఎన్నో రోజులుగా విద్యార్థులు స్కూలుకి నడిచి వెళ్తున్న తీరును గమనించి సైకిళ్లు పంపిణీ చేయాలని నిర్ణయించుకుని, కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిహెన్లీ,వర్ధనపుసుధాకర్,వర్ధనపురాధా అశోక్, పాలపర్తి పెద్దిరాజు, చింతా లాజరు, గాది కుమార్, తిరుపతి దేవిడ్ రాజు, బందారి పెద్దిరాజు,పెదపాటి రాజశ్రీ, వర్ధనపు హేమలత, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సైకిళ్లు పంపిణీ చేసిన ప్రభుదేవాను పలువురు ప్రసంశించారు.

## 'నడువు పదిమందిని నడిపించు'

**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:**తాడేపల్లిగూడెంలోవాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 201 పశ్చిమగోదావరి జిల్లా సంబంధించి క్యాబినెట్ సమా వేశం ఆదివారం జరిగింది. ఏలూరు నుండి అల్లూరి సీతారామరాజు స్టేడియం మార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎం అక్బర్ జిల్లా ట్రెజరర్ పి నాగ విగ్నేష్,జోన్ చైర్ పర్సన్ టి మేరీ మాణిక్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అక్బర్ మాట్లాడుతూ నడువు 10 మందిని నడిపించు అనే నినాదంపై పలు సూచనలు సలహాలు అందించారు. నాగ విగ్నేష్ మాట్లాడుతూప్రతి ఒక్కరు కూడా ఉదయం,సాయంత్రం తమరికి వీలైన ప్రదేశాలలో ఎక్కువగా నడవడం వలన తమ జీవితాల్లో ఎదురయ్యే శారీరక,మానసిక సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చునని అన్నారు.

# గొల్లప్రోలులో ఘనంగా బోనాల వేడుకలు





**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన గొల్లప్రోలు పట్టణ పరిధి రైల్వే స్టేషన్ సమీపంలో కొలువుతీరిన శ్రీ పాదాంబిక అమ్మవారు బోనాల వేడుకలను ఆషాడ మాసం సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ మొగలి అయ్యారావు ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజాము నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి బారులు తీరారు. అంతకు మునుపు గడిచిన వారంరోజుల నుండి అమ్మవారి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు, ఆలయ సుందరీకరణ పనులు నిర్వహించారు. శనివారం రాత్రి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పాదాంబికా అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ పండితులు తీర్థ ప్రసాదాలు అందించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లలో ప్రతి సంవత్సరం బోనాల వేడుకలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకుంటారు. అలాగే కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు పట్టణంలో వేలాదిమంది మహిళలు ఉదయం 10 గంటల నుండి బోనాల సంబరాలు అంబరాన్నంటే విధంగా జరుపుకున్నారు. బోనాలతో శ్రీ పాదంబిక అమ్మవారిని నగర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారిని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తుల అధిక సంఖ్యలో చేరుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తున్నారు. ఈ బోనాలు వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు రాజకీయ నాయకులు మొగలి మాణిక్యాలరావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకుడు చెక్కపల్లి దివాణం, ప్రముఖ వ్యాపారవేత్త గలుపల్లి చిన్న బాబి, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు గొల్లపల్లి పెద్ద బాబి, గలుపల్లి చిన్న కొండ, గలుపల్లి పెద్ద కొండ, జనసేన పార్టీ నాయకుడు బుడంకాయల దొరబాబు, జనసేన నాయకుడు మామిడాల సూరిబాబు, బస్వా చిట్టిబాబు మొగలి రాజా నాయుడు, దుర్గ గుడి చైర్మన్ గొల్లపల్లి గంగ, శివాలయం మాజీ చైర్మన్ కీర్తి వెంకటరమణ తదితర రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా చర్చి నిర్వహణపై వివాదం

– పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానికులు





**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు పట్టణం పరిధిలోని కరణం గారి తోట తాటిపర్తి రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన చర్చి నిర్వహణపై వివాదం చెలరేగింది. నిబంధనలకు విరుద్ధంగా చర్చి నిర్వహిస్తున్నారని పలువురు మహిళలు ఆదివారం గొల్లప్రోలు పోలీస్ స్టేషన్లో పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ గున్నబత్తుల శ్రీనివాస్ కు ఫిర్యాదు పత్రం అందించారు. వివరాల్లోకి వెళితే గడచిన పది రోజుల నుండి కరణం గారి తోటలో చర్చి నిర్వహణపై చుట్టుపక్కల ప్రజలు హిందువుల నివాసాల మధ్య ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చర్చి నిర్వహణపై స్థానిక ప్రజలు గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. రేయింబవళ్లు చర్చిలో లౌడ్ స్పీకర్లతో ప్రార్థనలు పెద్ద పెద్ద సౌండ్‌లతో పాటలతో నిర్వహిస్తూ రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని, హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా చర్చి నిర్వాహకులు ప్రవర్తిస్తున్నారని పలువురు స్థానిక మహిళలు పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ గున్నాబత్తుల శ్రీనివాస్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై హిందూ నివాసాల మధ్య ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారికంగా చర్చి నిర్వహిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐ కు ఫిర్యాదు చేసినవారిలో గొల్లపల్లి రాఘవ, కామిరెడ్డి వీరమణి, ఉమ్మడి వీరప్రభ, కామిరెడ్డి కుమారి, సఖిరెడ్డి చక్రమ్మ తదితరులు ఉన్నారు.

# రామేశ్వరంపేటలో ప్రభుత్వ వసతిగృహం నిర్మించాలి

– ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం డిమాండ్




**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** మండలం రామేశ్వరంపేట, సూరంపాలెం గ్రామాల మధ్యలో బాలురు, బాలికల వసతి గృహాలు ఏర్పాటు చేయాలని, అలాగే అక్కడ ఉన్న విద్యార్థులతో కలిసి మాట్లాడి వారి ఇబ్బందులు, సమస్యలు తెలుసుకుని, నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సతీష్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రధానంగా రామేశ్వరంపేట సూరంపాలెంలో ఆదిత్య యూనివర్సిటీ, ప్రగతి ఇంజనీరింగ్ కాలేజ్,మొదలగు కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులు సుమారు పదివేల మంది 5 వేల నుండి 8 వేల రూపాయలు (అంటే సంవత్సరానికి సుమారు 70,000 వేలు )అద్దెలు కట్టుకుంటూ బిల్డింగుల్లో ఉంటూ చదువులు సాగిస్తున్నారని ఆయన తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులపై ఇంతభారం పడుతుంది అంటే ప్రభుత్వం ఆలోచించాలని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం ఇలాంటి సమస్యలపై దృష్టి పెట్టలేదని ఆయన అన్నారు. ఇక్కడ విద్యార్థిని, విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించినట్లయితే అటు తల్లిదండ్రులకు భారం లేకుండా, ఇటు విద్యార్థిని విద్యార్థులు చదువుకుంటూ అభివృద్ధి చెందుతారని ఆయన తెలిపారు. అటు ప్రైవేటు కాలేజీలు హాస్టల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఆ ఫీజులు కట్టుకోలేక బయటే ఉండిపోతున్నామని విద్యార్థులు తెలిపారు. ఈ విషయంపై భవిష్యత్తులో కార్యచరణ నిర్మిస్తామని ఆయన తెలిపారు. పొత్తులో భాగంగా అధికారం చేపట్టిన జగ్గంపేట శాసనసభ్యులు వారు, అలాగే జనసేన పార్టీ నాయకులు, పెద్దలు స్పందించి దృష్టి పెట్టి విద్యార్థుల భవిష్యత్తుకు మార్గాలు చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సూరంపాలెం బూత్ లెవెల్ ఇంచార్జ్ చెల్లె రవి, సురేంద్ర, అభి, కుండబాబు, సంతోష్,ధర్మంద్ర, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవుని కుటుంబ సమేతంగా దర్శించుకున్న హైకోర్టు జడ్జ్ రవినాథ్ తిల్హరి





**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనార్థం హైకోర్టు జడ్జి రవినాథ్ తిల్హరి కుటుంబ సమేతంగా శ్రీ సత్యదేవుని సన్నిధికి విచ్చేశారు. ముందుగాఆలయ అధికారులు,ఏఈఓ దామోర్లకృష్ణారావు,ఆలయఅర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రవినాథ్‌తిల్హరిశ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా దామోర్ల కృష్ణారావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్స్ ఇన్స్పెక్టర్ నక్క సత్యనారాయణ పాల్గొన్నారు.

## మన ప్రాంత అభివృద్ధికి అందరూ సహకరించాలి

– ఎమ్మెల్యే నల్లమిల్లి.




**అనపర్తి, మేజర్ న్యూస్:** రెడ్డి సామాజిక వర్గానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని, మన ప్రాంత అభివృద్ధికి అందరూ నడుం బిగించాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తి మండలం దుప్పలపూడిలో ఆర్.వి.ఆర్.సి కన్వెన్షన్ హాలు లో "ఇచ్చాపురం నుండి గుంటూరు వరకు రెడ్డి సామాజిక వర్గం నుండి ఏకైక రెడ్డి ఎమ్మెల్యే గా బిజెపి నుండి ఎన్నికైన సందర్భంగా కోస్తా అంతా రిజిస్ట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని సన్మానించి, సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గంలో అనేక మంది ప్రముఖులు తమ ఆస్తులను సైతం వారి ప్రాంత అభివృద్ధికి ఖర్చు చేశారని, అటువంటి మహానీయులను ఆదర్శంగా తీసుకొని మన ప్రాంతా అభివృద్ధికి అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోస్తా ఆంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం మరియు రెడ్డి గ్రామ సంఘాలు, అనపర్తి నియోజకవర్గం ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్రాగునీరులో తోక పురుగులు



**సామర్లకోట, మేజర్ న్యూస్:**సామర్లకోట పట్టణ ప్రజలకు మున్సిపల్ కుళాయి ద్వారా సరఫరా అవుతున్న మంచినీళ్లు తోక పురుగులు దర్శనమిచ్చాయి. గత కొద్ది రోజులుగా సామర్లకోట మున్సిపల్ త్రాగునీరు సరఫరాలో పచ్చ రంగు కలిగి దుర్వాసనతో మంచినీరు సరఫరా చేస్తున్న సంగతి విదితమే.

కాగా ఆదివారం మున్సిపల్ కుళాయిలా ద్వారా సరఫరా కాబడిన మంచి నీరులో తోక పురుగులు దర్శనమిచ్చాయి. బ్రౌన్ పేట, అంబేద్కర్ కాలనీ, సీతారామ కాలనీ ప్రాంతాల్లో మంచినీరు సరఫరాలో ఈ తోక పురుగులు వచ్చాయి.